నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, గురువారం 30 జనవరి 2025 | NIZAMABAD

# హామీల అమలులో కాంగ్రెస్ సర్కార్ విఫలం

- జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే
- పలు గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమావేశాలు

బిచ్కుంద, జనవరి 29: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా, ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి ప్రజలు బాధపడుతున్నారని పేర్కొన్నారు. పాలిచ్చే బర్రెను కాకుండా గొడ్డు బర్రెను తెచ్చుకున్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. జుక్కల్ మండలంలోని చండేగావ్, మాదాపూర్, హంగర్గ, బిజ్జల్ వాడి, కతల్‌వాడి, నాగల్‌గావ్, చిన్న ఏడ్గి, పెద్ద ఎడ్గి గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశాలు బుధవారం నిర్వహించారు. ఈ సమావేశాలకు షిండే హాజరై మాట్లాడారు. రేవంత్ సర్కార్ రైతులకు ఇస్తానన్న రైతుభరోసా ఇవ్వకుండా మోసంచేసిందని మండిపడ్డారు. సర్కారు ఎకరాకు రూ.17,500 చొప్పున రైతులకు బాకీ ఉందని, ఎప్పుడు తీరుస్తారో చెప్పాలని ప్రశ్నించారు. ఎన్నికలప్పుడే కాంగ్రెస్ పార్టీకి సంక్షేమ పథకాలు గుర్తుకు వస్తాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ హయాంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని, ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టి చూసుకుంటానని భరోసా ఇచ్చారు. నాలుగేండ్లు ఒప్పిగ్గా ఉండాలని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. తన హయాంలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నీలూ పటేల్, బొల్లి గంగాధర్, వాసర్‌వార్ రమేశ్, భానుగౌడ్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హంగర్గ గ్రామస్తులతో ముచ్చటిస్తున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

# నేడు బీఆర్ఎస్ నిరసనలు

- రాష్ట్ర ప్రభుత్వం '420' హామీలు అమలుచేయాలని డిమాండ్
- గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేత
- పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి పిలుపు

ఆర్మూర్‌టౌన్, జనవరి 29: ఎన్నికల వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లావ్యాప్తంగా గురువారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఈ నెల 30వ తేదీ నాటికి 420 రోజులైనా, ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలుచేయడంలేదని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు, ఇందులో భాగంగా మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు ఇచ్చి, ఎన్నికల హామీలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, అన్ని స్థాయిల పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొనాలని జీవన్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# ఏఈఈ ఆత్మహత్య

## పనిఒత్తిడే కారణమా !

సాయిచరణ్ (ఫైల్)

డిచ్‌పల్లి, జనవరి 29: విధి నిర్వహణలో తీవ్ర ఒత్తిడికి లోనై, మానసికంగా కృంగిపోయి నీటిపారుదల శాఖ ఉద్యోగి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం నడ్పల్లి శివారులో చోటు చేసుకున్నది. డిచ్‌పల్లి ఎస్సై షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన కత్తులపురం సాయిచరణ్ (30) ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆరు నెలల క్రితం అతడికి నీటిపారుదల శాఖ (మిషన్ భగీరథ)లో ఏఈఈ (అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్)గా ఉద్యోగం రాగా, ధర్పల్లిలో విధులు నిర్వహిస్తున్నాడు. పనిచేసే చోట తీవ్ర ఒత్తిడికి లోనైనట్లు తరచూ తల్లిదండ్రులకు చెబుతూ మానసింగా కృంగిపోయేవాడు. ఈనెల 28న సాయిచరణ్ విధులకు వెళ్తున్నట్లు చెప్పి, మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో డిచ్‌పల్లి మండలం నడ్పల్లి శివారులో పురుగుల మందు తాగాడు. స్థానికులు, పోలీసుల ద్వారా సమాచారం తెలుసుకున్న కుటుంబీకులు వెంటనే హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు తరలించగా బుధవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి సోదరి హారిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.




*'కనిపించే మూడు సింహాలు చట్టానికి, న్యాయానికి, ధర్మానికి ప్రతీకలైతే, కనిపించని నాలుగో సింహమేరా పోలీస్..' అంటూ ఓ సినిమాలో హీరో చెప్పే ఈ డైలాగు దశాబ్దాలుగా ప్రజల మనసుల్లో నాటుకుపోయింది. సమాజరక్షణతోపాటు క్రమశిక్షణకు చిరునామాగా ఉండాల్సిన 'నాలుగో సింహం' గాడి తప్పుతున్నది. ఆదర్శంగా నిలవాల్సిన పోలీసులే లంచాలకు ఎగబడుతున్నారు. ఒకరిని చూసి మరొకరు పోటీపడి మరీ వసూళ్లకు తెగబడుతున్నారు. ఇటీవలి కాలంలో చాలా మంది పోలీసు అధికారులు ఏసీబీకి పట్టుబడుతుండడం..ఏ స్థాయిలో అవినీతి పెచ్చుమీరిందో చెప్పడానికి నిదర్శనంగా నిలుస్తున్నది. తాజాగా కామారెడ్డి జిల్లా లింగంపేట ఠాణా ఎస్సై లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కడం..ఆ శాఖలో కలకలం సృష్టించింది.*

*– నిజామాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

- ఏసీబీకీ చిక్కుతున్నా మారని తీరు
- పోలీసుశాఖలో పెచ్చుమీరిన అక్రమాలు
- సామాన్యులను సమిధలు చేస్తూ వసూళ్ల బేరం
- అమాయకులనే టార్గెట్ చేస్తున్న పోలీసు అధికారులు
- ఓ వైపు ఇసుక అక్రమ వ్యవహారాలు, మరోవైపు లంచాలు
- ఏడాది కాలంగా సాగుతున్న అవినీతిపర్వం

సామాన్యులు, పేద ప్రజలు అనే తేడా లేకుండా డబ్బులే పరమావధిగా పని చేస్తున్నారు. సమాజంలో పోలీసులంటే విశిష్టమైన గౌరవ, మర్యాదలు దక్కుతాయి. ప్రజల మాన, ప్రాణాలను రక్షించే రక్షక భటుల్లో నిబద్ధత, నిజాయితీతో పని చేసే వారు చాలా మంది ఉన్నారు. అదే సమయంలో మరికొంత మంది అక్రమార్కులు ప్రజల సేవలో తరిస్తున్నట్లుగా నటిస్తూ సంపాదనే లక్ష్యంగా బరితెగించి పని చేస్తున్నారు. సామాన్యులకు న్యాయం చేయాల్సిన పోలీస్ అధికారులు కాసుల కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. పోలీస్ శాఖకే మాయని మచ్చను తీసుకువస్తున్నారు. ఇందులో నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్, కామారెడ్డి జిల్లా పోలీస్ శాఖలో ఈ మధ్య కాలంలో తరచూ ఎస్సైలు రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి చిక్కుతుండడం విస్మయానికి గురిచేస్తున్నది. పోలీస్ స్టేషన్‌లనే వసూళ్లకు అడ్డాగా చేసుకుంటున్న ఖాకీల తీరుపై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడుతున్నది. నిత్యం నీతులు చెప్పే పోలీస్ అధికారులే గాడి తప్పుతుండడంతో ప్రజల్లో విరక్తి పుడుతున్నది. పోలీస్ ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో ఠాణాల్లో ఎస్సైలది ఆడిందే ఆట, పాడిందే పాటగా మారింది. సివిల్ సెటిల్మెంట్లు, భార్యాభర్తల పంచాయితీ, ఇతర దందాల్లో ప్రత్యక్షంగా పాత్రధారులుగా నిలుస్తూ స్టేషన్లను అవినీతికి అడ్డాగా మార్చుతున్నారు.

ఆగని అవినీతి

# కాసుల వేటలో ఖాకీ!

## అవినీతి ఠాణా లింగంపేట...

లింగంపేట పోలీస్ స్టేషన్ అవినీతికి అడ్డాగా మారింది. ఇక్కడ పని చేస్తున్న పోలీసులకు ఈ ఠాణా కల్పతరువుగా మారింది. రోజుల వ్యవధిలోనే ఇద్దరు స్టేషన్ హౌస్ ఆఫీసర్లుగా పని చేస్తున్న ఎస్సైలు అవినీతి కేసుల్లో ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడడం సంచలనంగా మారింది. ఎస్సైల అవినీతి బాగోతాన్ని అవినీతి నిరోధక శాఖ బట్టబయలు చేస్తుండడంతో లింగంపేట పీఎస్ పరువు మంటగలుస్తున్నది. మెదక్ జిల్లాకు సరిహద్దుగా ఉన్న లింగంపేట అటవీ ప్రాంతం. ఇక్కడ వ్యవసాయ, వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు ఎక్కువే. కలప, గంజాయి అక్రమ రవాణా, జంతువుల వేట సాగిస్తుంటారు. ఈ ప్రాంతంలో ఎస్సైగా పని చేయాలంటే సవాల్‌తో కూడుకున్న వ్యవహారం. అలాంటి పోలీస్ స్టేషన్‌కు హౌస్ ఆఫీసర్లుగా వస్తున్న ఎస్సైలు కేవలం కాసుల కోసం కక్కుర్తిపడుతున్నారు. నవంబర్ 14న రూ.20వేలు లంచం తీసుకుంటుండగా ఎస్సై అరుణ్ కుమార్, రైటర్ రామస్వామి ఇద్దరిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఓ కేసు విషయంలో స్టేషన్ బెయిల్ మంజూరు కోసం డబ్బులు డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించి లంచగొండి పోలీస్ అధికారిని కటకటాలకు పంపించాడు. ఎస్సై అరుణ్ స్థానంలో ఎస్సై సుధాకర్ వచ్చి రాగానే వసూళ్లకే పాల్పడినట్లు ప్రచారం జరుగుతున్నది. ఇదే కోవలో ఓ వాహన విక్రయదారుడి నుంచి బుధవారం రూ.12,500 తీసుకుంటూ నిజామాబాద్‌లో ఏసీబీకి చిక్కడంతో అవినీతి బట్టబయలైంది. రెండున్నర నెలల వ్యవధిలోనే ఒకే ఠాణాలో ఇద్దరు ఎస్సైలు ఏసీబీకి లంచం తీసుకుంటూ చిక్కడం చర్చనీయాంశంగా మారింది. పదేండ్ల కాలంలో లింగంపేట ఠాణాలో ఎస్సైలు ఏసీబీకి చిక్కడం ఇదీ నాలుగో కేసు కావడం గమనార్హం. కామారెడ్డి పోలీస్ శాఖలో లింగంపేట తరహాలోనే వసూళ్ల పర్వం సర్వత్రా నెలకొన్నది. ఆరోపణలు వస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారుల నిర్లక్ష్యమే ఏసీబీకి చిక్కి ఖాకీల పరువును బజారున పడేస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## ఏసీబీకి చిక్కిన లింగంపేట ఎస్సై

### రూ.12,500 లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు

ఏసీబీ అధికారులకు పట్టుబడిన లింగంపేట ఎస్సై సుధాకర్

వినాయక్‌నగర్/లింగంపేట, జనవరి 29: లింగంపేట ఎస్సై సుధాకర్ ఏసీబీ వలకు చిక్కాడు. ద్విచక్ర వాహనాలను విక్రయించే ఓ వ్యక్తి నుంచి బుధవారం రూ.12, 500 లంచం తీసుకుం టూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. నిజామాబాద్ ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ తెలిపిన మేరకు వివరాలు.. లింగంపేట్‌కు చెందిన నగేశ్ తన కారును అదే ఏరియాకు చెందిన మరో వ్యక్తికి విక్రయించాడు. ఆ కారును మూడో వ్యక్తిగా నిజామాబాద్ మండలంలోని బోర్గాం(పీ) వద్ద ఉన్న కారు బజార్ నిర్వాహకుడు స్వామి కొనుగోలు చేశా డు. స్వామి ఆ కారును చిరంజీవి అనే వ్యక్తికి విక్రయించాడు. లోన్ ద్వారా తీసుకున్న ఆ కారు మొత్తం నలుగురు వ్యక్తుల చేతులు మారినప్పటికీ లోన్ డబ్బులు ముట్టకపోవడంతో రిజిస్ట్రేషన్ కాలేదు. కారును కొనుగోలు చేసిన చిరంజీవి లోన్ డబ్బులు చెల్లించకపోవడంతో కారు మొదటి యజమాని రాజేశ్‌కు నోటీసులు వచ్చాయి. దీంతో అతడు లింగంపేట ఎస్సై సుధాకర్‌కు ఫిర్యాదు చేశాడు. సదరు ఎస్సై కార్ బజార్ నిర్వాహకుడు స్వామికి ఫోన్ చేసి, నీపై ఫిర్యాదు వచ్చిందని, కేసు కాకుండా ఉండడానికి రూ.30 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో కార్ బజార్ నిరాహకుడు రూ.12, 500 ఇస్తానని ఎస్సైతో ఒప్పందం కుదుర్చుకొని, ఏసీబీని ఆశ్రయించాడు. బుధవారం సెలవుపై ఎస్సై సుధాకర్ నిజామాబాద్‌కు వచ్చాడు. స్వామికి ఫోన్ చేసి, తాను వినాయక్‌నగర్‌లోని హనుమాన్ జంక్షన్ వద్ద ఉన్నానని, డబ్బులు తీసుకురావాలంటూ చెప్పాడు. దీంతో స్వామి హనుమాన్ జంక్షన్ వద్ద కారులో కూర్చొని ఉన్న ఎస్సై సుధాకర్‌కు రూ.12,500 ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ సిబ్బందితో కలిసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఎస్సైని నాల్గో టౌన్‌కు తరలించి,కేసు నమోదు చేశారు.

## గాడి తప్పిన పోలీస్ కమిషనరేట్

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. ఇన్‌చార్జి సీపీగా కామారెడ్డి ఎస్పీ సింధూ శర్మ ఉన్నప్పటికీ రెగ్యులర్ సీపీ లేకపోవడంతో కింది స్థాయిలో ఇష్టారాజ్యం నడుస్తున్నది. సీపీగా కల్మేశ్వర్ సింగెనవార్ ఉన్నప్పుడు కొంతకాలం అక్రమాలకు తావు లేకుండా కనిపించింది. కొంత మంది నాటి సీపీకి తప్పుడు సమాచారాన్ని అందించి తప్పటడుగులు వేయించినప్పటికీ కింది స్థాయిలో ఎస్సై, సీఐ, ఏసీపీలంతా కల్మేశ్వర్ చెంత పని చేసేందుకు వణికి పోయారు. ఆయన బదిలీతో ఇప్పుడంతా అస్తవ్యస్తంగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నవంబర్ 8, 2024లో వర్ని ఎస్సై కృష్ణ సైతం లంచం తీసుకుంటూ పోలీస్ స్టేషన్‌లోనే ఏసీబీకి దొరికాడు. ఇసుక మామూళ్లలో 12 మంది ఎస్సై, సీఐలపై చర్యలు తీసుకోవాలంటూ నాలుగు నెలల క్రితమే డీజీపీ ఆదేశాలిచ్చారు. అయినప్పటికీ ఇసుక అక్రమాలు ఆగలేదు. ఖద్దర్ నేతలతో కలిసి పలువురు ఖాకీలు చెట్టాపట్టాలేసుకుని వసూళ్లకు పాల్పడుతున్నారు. ఏసీపీగా ఈ మధ్యే ప్రమోషన్ పొందిన బస్వారెడ్డి నేరుగా నిజామాబాద్‌లోనే పోస్టింగ్ దక్కించుకుని అదనపు డీసీపీగా కొనసాగుతున్నారు. సీపీ లేకపోవడంతో ఆయనే కీలకంగా మారారు. సీపీ సీటు ఖాళీ ఏర్పడి నెలలు గడుస్తున్నా, ప్రభుత్వం కొత్త వారిని నియమించడం లేదు. దీంతో పాలన గాడి తప్పుతున్నది. నిజామాబాద్ నగరంలో ఆయా టౌన్‌లలో ఫిర్యాదుల వరకే పలు కేసులు పరిమితమవుతున్నాయి. ఎఫ్ఐఆర్ కాక మునుపే సెటిల్మెంట్లతో పలువురు ఎస్సైలు జేబులు నింపుకొంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ షెడ్యూల్ విడుదల
- అమల్లోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి
- ముగియనున్న టి.జీవన్ రెడ్డి, రఘోత్తం రెడ్డి పదవీకాలం
- ఉమ్మడి జిల్లాలో 46,469 మందికి పట్టభద్రుల ఓటు హక్కు
- ఉపాధ్యాయ ఓటర్లు 5,590 మంది

ఫిబ్రవరి 3న నోటిఫికేషన్, 27న పోలింగ్, మార్చి 3న ఓట్ల లెక్కింపు

# మోగిన నగారా

నిజామాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ నియోజకవర్గాల పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు నగారా మోగింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈసీ ప్రకటనతో ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. ఏక కాలంలో ఒకే సమయంలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం పట్టభద్రుల నియోజకవర్గం నుంచి టి.జీవన్ రెడ్డి ఎమ్మెల్సీగా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా రఘోత్తం రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిద్దరూ 2019లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. త్వరలోనే వీరి పదవీ కాలం ముగియనున్నది.

### ఎన్నికల షెడ్యూల్ ఇలా..

ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ కానున్నది. అదే రోజు నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఫిబ్రవరి 10 నామినేషన్ల దాఖలుకు చివరి తేదీగా ఈసీ పేర్కొన్నది. నామినేషన్ల పరిశీలన ఫిబ్రవరి 11, ఫిబ్రవరి 13న నామినేషన్ల ఉప సంహరణకు గడువుగా ఎన్నికల సంఘం నిర్ణయించింది. నామినేషన్ల గడవు ముగిసిన అనంతరం 12 రోజుల పాటు ఎన్నికల ప్రచారానికి అభ్యర్థులకు అవకాశం ఉన్నది. ఫిబ్రవరి 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపడుతారు. ప్రాధాన్యత ఓటు హక్కు ఆధారంగా బ్యాలెట్ రూపంలో పోలింగ్ ఉండడంతో ఓట్ల లెక్కింపునకు సుదీర్ఘ సమయం పట్టే అవకాశం ఉన్నది. మార్చి 8 నాటికి ఎన్నికల కోడ్ ముగియడంతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన మొత్తం ప్రక్రియ పూర్తి చేయనున్నారు.

### ఉమ్మడి జిల్లాలో 46,469 మంది పట్టభద్రులు...

ఉమ్మడి జిల్లాల్లో మొత్తం 46,469 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. గతంతో పోలిస్తే ఈసారి వారి సంఖ్య భారీగా పెరిగినప్పటికీ ఆ స్థాయిలో ఓటరు నమోదు జరుగలేదు. జిల్లా ఎన్నికల అధికారి పాత్రను పోషించే కలెక్టర్లు ఈ ఎన్నికలను పట్టించుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీసం ఓటు హక్కు నమోదుకు ప్రచారం నిర్వహించలేదు. మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల్లో మొత్తం రెండున్నర లక్షల మంది వరకు పట్టభద్రుల ఓటర్లు ఉండే అవకాశం ఉన్నది.

నిజామాబాద్ జిల్లాలో 30,593 మంది ఓటర్లున్నారు. వీరిలో మహిళా ఓటర్లు 11,225 మంది ఉన్నారు. పురుష ఓటర్లు 19,368 మంది ఉన్నారు.కామారెడ్డి జిల్లాలో మొత్తం 15,876 మంది ఓటర్లున్నారు. వీరిలో మహిళా ఓటర్లు 4,588 మంది ఉండగా, పురుష ఓటర్లు 11,288 మంది ఉన్నారు. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 48 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. కామారెడ్డి జిల్లాలో 29 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికార యంత్రాంగం కార్యాచరణను ఇప్పటికే సిద్ధం చేసింది.

### ఉపాధ్యాయ ఓటర్ల వివరాలివీ...

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 5,590 మంది ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కోసం దరఖాస్తు సమర్పించారు. నిజామాబాద్ జిల్లాలో 3,529 మంది ఉపాధ్యాయ ఓటర్లుండగా, మహిళా ఓటర్లు 1429 మంది, పురుషులు 2100 మంది ఉన్నారు. కామారెడ్డి జిల్లాలో 2061 మంది ఉపాధ్యాయ ఓటర్లుండగా వీరిలో మహిళా ఓటర్లు 720, పురుష ఓటర్లు 1341 మంది ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం నిజామాబాద్‌లో 33 , కామారెడ్డి జిల్లాలో 25 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేయనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పట్టభద్రులకు 77 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రధాన రాజకీయ పార్టీల మద్దతు కోసం పలువురు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. వివిధ విద్యా సంస్థల యజమానులు, వివిధ రంగాల్లో ప్రజలకు సేవలు అందించిన వారంతా పోటీలో నిలబడేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకున్నారు. ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడం, ఫిబ్రవరి 3న నోటిఫికేషన్‌తో పాటు నామినేషన్ల స్వీకరణ మొదలు కానుండడంతో అభ్యర్థులు సంసిద్ధులవుతున్నారు. మరోవైపు షెడ్యూల్ విడుదలతో ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలతోపాటు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు వంటి కార్యక్రమాలేవీ జరగడానికి అవకాశం లేదు.

# 'డబుల్ ఇండ్ల' కోసం ఆందోళన

ఎల్లారెడ్డి తహసీల్ కార్యాలయం ఎదుట ప్రధానరహదారిపై ధర్నా చేస్తున్న డబుల్‌బెడ్ రూం ఇండ్ల లబ్ధిదారులు

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 29: తమకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులు ధర్నా చేపట్టారు. బుధవారం కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి రెవెన్యూ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఎల్లారెడ్డిలో ఈ నెల 26న డబుల్ బెడ్‌రూం ఇండ్ల పంపిణీ కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా నిర్వహించారు.

## ఎల్లారెడ్డిలో ప్రధాన రహదారిపై లబ్ధిదారుల ధర్నా

ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్ హాజరై ఇద్దరికి మాత్రమే ఇండ్లను అందజేసి, మిగతావారికి అధికారులు అందజేస్తారని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం గొడవ చోటుచేసుకోగా..ఎల్లారెడ్డి కాంగ్రెస్ నాయకులు కల్పించుకొని మూడు రోజుల తర్వాత రెవెన్యూ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి లబ్ధిదారులకు అందజేస్తారని మైక్‌ద్వారా ప్రకటించారు. దీంతో రెండురోజులుగా లబ్ధిదారులు రెవెన్యూ కార్యాలయానికి క్యూ కట్టారు. అక్కడ వారికి సరైన సమాధానం ఇచ్చేవారే కరువయ్యారు. బుధవారం ఉదయం వచ్చిన లబ్ధిదారులు మధ్యాహ్నం ఆందోళన వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. జాబితాలో తమ పేర్లు ఉన్నాయని., న్యాయంగా తమకు రావాల్సిన ఇండ్లను ఇచ్చేయాలని వారు కోరారు. మూడు రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నామంటూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా..వారు తమను చూసి నవ్వుతున్నారని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తంచేశారు. విషయం తెలుసుకొని అక్కడికి వచ్చిన ఇన్‌చార్జి తహసీల్దార్ చరణ్‌సింగ్ లబ్ధిదారులతో మాట్లాడారు. సోమవారం నుంచి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటుచేసి ఇండ్ల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని చెప్పడంతో వారు శాంతించారు.

# వికటించిన మధ్యాహ్న భోజనం

- 16 మంది విద్యార్థులకు అస్వస్థత
- పలువురు దవాఖానలో చేరిక
- ఎల్లారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో ఘటన

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 29: ఎల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి 16మంది విద్యార్థులు అస్వస్థతకు గురికాగా, దవాఖానకు తరలించి చికిత్స అందించారు. బుధవారం చోటుచేసుకున్న ఈ సంఘటన వివరాలు.. రోజు మాదిరిగానే విద్యార్థులకు ఏజెన్సీ నిర్వాహకులు మధ్యాహ్న భోజనాన్ని వండి పెట్టారు. భోజనం ముగిసిన గంట తర్వాత విద్యార్థులకు కడుపునొప్పిరావడం, వాంతులు చేసుకొని అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. 16మంది విద్యార్థులకు వైద్యులు చికిత్స అందించగా, సాయంత్రం వరకు కోలుకున్న కొందరిని డిశ్చార్జ్ చేసి ఇంటికి పంపించారు. నలుగురు విద్యార్థులు మాత్రం దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఏజెన్సీ నిర్వాహకురాలు మధ్యాహ్నం వండిన టమాట కూర తిన్న తరువాతే తాము అస్వస్థతకు గురైనట్లు విద్యార్థులు చెబుతున్నారు. టమాట కూరలో నాణ్యతలేకపోవడంతో అస్వస్థతకు గురైనట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

సుఖీభవ హాస్పిటల్
డా॥ ప్రతాప్‌రెడ్డి బిల్డింగ్, బస్టాండ్ ఎదురుగా
నంబిపేట్, Cell: 9133422640
సుఖీభవ హాస్పిటల్‌ను స్థాపించి నేటికి 5 సంవత్సరాలు పూర్తి చేసుకుని మీ ఆశీర్వాదంతో
6వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభసందర్భంగా మా మిత్రులకు
శ్రేయోభిలాషులకు మరియు సిబ్బందికి
5వ వార్షికోత్సవ శుభాకాంక్షలు...
డా॥ వి.జగతరాజ్
General Physician
బి.పి., షుగర్ మరియు జనరల్ వైద్య నిపుణులు
డా॥ జె.అమిత
MBBS, DNB
(Pediatrician)
పిల్లల వైద్యనిపుణురాలు
గుడ్డేటి రాజు
మేనేజ్‌మెంట్
నరేందర్ కుమార్
మేనేజ్‌మెంట్
మా ప్రత్యేకతలు: NICU, PICU, ICU 20 పడకల ఆసుపత్రి 6 పడకల ఐసియూ
డిజిటల్ ఎక్స్‌రే ఇసిజి మెషిన్ 24 గంటలు ల్యాబ్ సౌకర్యం 24 గంటలు ఫార్మసి సౌకర్యం
సెంట్రల్ ఆక్సిజన్ ఫోటో థెరపి అంబులెన్స్
మా విభాగాలు: జనరల్ ఫిజిషియన్ చిల్డ్రన్ స్పెషలిస్ట్
మా యొక్క సంస్థలు:
శ్రీధరణి మెడికల్ - నంబిపేట్
ధరణి శ్రీహాస్పిటల్ - ఇందల్‌వాయి
ప్